ముప్పై నుంచి వంద పడకలు!

- నివేదిక కోరిన ఉన్నతాధికారులు
- ఆస్పత్రి భవన నిర్మాణానికి 4 ఎకరాలకు పైగా స్థలం కేటాయింపు

దోమకొండ: మండల కేంద్రమైన దోమకొండలోని 30 పడకల క్లస్టర్ ఆస్పత్రి స్థాయిని 100 పడకల స్థాయికి పెంచేందుకు కసరత్తు మొదలైంది. ఈ మేరకు వైద్యవిధాన పరిషత్ నుంచి నివేదిక కోరారు. ఆస్పత్రి నూతన భవన నిర్మాణానికి 4 ఎకరాల 3 గుంటల భూమిని కేటాయిస్తూ గ్రామ పంచాయితీ పాలకవర్గం రెండు రోజుల కిందట తీర్మానం చేసింది. తీర్మాన ప్రతిని వైద్య విధాన పరిషత్ కమిషనర్, డీసీహెచ్ఎస్‌కు పంపినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఇటీవల కామారెడ్డికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావ్ వచ్చినప్పుడు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌తో కలిసి స్థానిక ప్రజాప్రతినిధులు ఆస్పత్రి స్థాయిని పెంచాలని కోరిన విషయం తెలిసిందే. కామారెడ్డి ఆస్పత్రి వంద పడకల స్థాయి నుంచి 300 పడకలకు పెరగనుంది. బాన్సువాడ, ఎల్లారెడ్డిలలో ఇప్పటికే వంద పడకల ఆస్పత్రులు ఉన్నాయి.

దోమకొండలో గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండేది. ప్రజాప్రతినిధులు స్థానికులు ఆస్పత్రి స్థాయిని 30 పడకలకు పెంచాలని అప్పట్లో రిలే దీక్షలు చేపట్టడంతో 2000లో సీహెచ్‌సీగా మార్పు చేస్తూ అప్పటి ప్రభుత్వం జీవో జారీ చేసింది.


దోమకొండలోని సామాజిక ఆరోగ్య కేంద్రం

ఐదు మండలాల ప్రజలకు సేవలు

వంద పడకల ఆస్పత్రిగా మార్పు చేస్తే మరిన్ని సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో డాక్టర్లు, వైద్య సిబ్బంది సంఖ్య పెరిగే అవకాశం ఉంది. దోమకొండ, భిక్కనూరు, మాచారెడ్డి, బీబీపేట, రాజంపేట మండలాలతో పాటు, సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక, నిజాంపేట మండలాల వారికి దగ్గరగా ఉంటుంది.

ప్రజలకు మెరుగైన సేవలు



దోమకొండలో వంద పడకల ఆస్పత్రి నిర్మిస్తే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి. ఆస్పత్రి నిర్మాణానికి స్థలాన్ని కేటాయిస్తూ ఇప్పటికే పాలకవర్గం తీర్మానించింది.
–నల్లపు అంజలి, సర్పంచ్, దోమకొండ

నివేదిక పంపాం



ఆస్పత్రిని వంద పడకలకు పెంచే విషయమై అధికారులు అడిగిన మేరకు ఇప్పటికే నివేదిక పంపాం. ప్రస్తుతం స్థానికంగా అందుతున్న సేవలు, ఓపీ, ఆస్పత్రి కోసం స్థలం కేటాయింపు తదితర సమాచారాన్ని ఉన్నతాధికారులకు ఇచ్చాం.
–విజయలక్ష్మి, డీసీఎచ్ఎస్, కామారెడ్డి

డబుల్ బెడ్రూం ఇళ్లు ఏవీ?


మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ హయాంలో కామారెడ్డి నియోజకవర్గంలో 20 వేల ఇళ్లు నిర్మిస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కనీసం 3 వేల డబుల్ బెడ్రూం ఇళ్లు కూడా రాలేదని కాంగ్రెస్‌కు చెందిన మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి లేక 15 ఏళ్లు వెనక్కి పోయిందన్నారు. శనివారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం షబ్బీర్ అలీ మాట్లాడుతూ నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నా ప్రస్తుత పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు, పట్టణ అధ్యక్షుడు పండ్లరాజు, గూడెం శ్రీనివాస్ రెడ్డి, దేవరాజ్ గౌడ్, కారంగుల అశోక్ రెడ్డి, గుడుగుల శ్రీనివాస్, ఐరేని సందీప్, చందు, సునీల్ గౌడ్, అంతంపల్లి సుధాకర్, గణేష్ నాయక్, సాయి రెడ్డి, సుమ ప్రియ, సంపత్, అబ్బు, మధు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే చేసి పట్టాదారులకు న్యాయం చేస్తాం

సాక్షి ఎఫెక్ట్..

రాజంపేట: కబ్జా చేసిన భూములను సర్వే చేసి పట్టాదారులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ టి.శాంత వెల్లడించారు. సాక్షి దినపత్రికలో శనివారం 'కబ్జాదారుల నుంచి భూమి ఇప్పించాలి' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. రాజంపేట సర్వే నంబర్ 634/జి లోని పట్టాభూములను శనివారం తహసీల్దార్ టి.శాంత పరిశీలించి పట్టాదారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వే కోసం దరఖాస్తు చేసుకోవాలని జోగిపేట బాల్‌రెడ్డికు సూచించినట్లు ఆమె పేర్కొన్నారు. అయితే తన పరిశీలనలో భూమి కబ్జాకు అయినట్లు కన్పించలేదని అయినప్పటికీ సర్వే చేస్తామని తహసీల్దార్ వెల్లడించారు.

నిత్యావసర ధరలు తగ్గించాలి


ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు

కామారెడ్డి టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు నిత్యావసర, ఇంధన ధరలను తగ్గించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ డిమాండ్ చేశారు. పల్లె పల్లెకు సీపీఐ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు ఫణిహారం రంగాచారీ విగ్రహానికి పూలమాలు వేసి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ ఏవో రవీందర్‌కు అందజేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దశరథ్, సహాయ కార్యదర్శి పి. బాలరాజ్, నాయకులు దేవయ్య, శ్యామల, పుష్పలత, మల్లేష్, రాజమణి, సాయిలు, నాగమణి పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ మూసివేసే వరకు బీజేపీ పోరాటం


నిరసన దీక్షలో పాల్గొన్న బీజేపీ నేతలు

భిక్కనూరు: వ్యర్థ పదార్థాలతో ప్రజల ప్రాణాలను హరిస్తున్న ఎంఎస్ఎన్ కెమికల్ ఫ్యాక్టరీని మూసివేసే వరకు బీజేపీ పోరాటం చేస్తోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రెడ్డిగారి రమేశ్‌రెడ్డి అన్నారు. కాచాపూర్‌లో వీడీసీ అధ్వర్యంలో చేపట్టిన నిరసదీక్ష శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి వారికి సంఘీభావం ప్రకటించారు. నిబంధనలకు విరుద్ధంగా ఫ్యాక్టరీ యాజమాన్యం వ్యవహరిస్తోందని ఆరోపించారు. బీజేపీ నేతలు శ్రీధర్, వెంకట్ జైపాల్‌రెడ్డి, గణేషరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు చేయించాలి


మాట్లాడుతున్న రాష్ట్ర పద్మశాలి ఎన్నికల కన్వీనర్

కామారెడ్డి టౌన్: పద్మశాలీలు సభ్యత్వ నమోదు చేయించాలని రాష్ట్ర పద్మశాలి సంఘం ఎన్నికల కన్వీనర్ రామా శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక పద్మశాలి సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని జిల్లాలో సభ్యత్వ నమోదు పూర్తయిన తర్వాత రాష్ట్ర ఎన్నికల కమిటీని నియమిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర పద్మశాలి సంఘం ప్రతినిధులు గంజి శ్రీనివాస్, గుజ్జా బాల్‌రాజు, బూర మల్లేశం, ఐరేని నర్సయ్య, రాజయ్య, సబ్బని ధర్మపురి భూమేష్, షేర్ల రాములు, గోవర్ధన్, గణేష్, సందీప్, సిద్ధరాములు, నాగరాజు, లక్ష్మీనారాయణ, మధు, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలి


నిరుద్యోగ దీక్షలో బీజేపీ నాయకులు

కామారెడ్డి టౌన్: రాబోయే ఎన్నికల్లో యువత బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన నిరుద్యోగ దీక్షకు వెంకటరమణారెడ్డి మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగులను ప్రభుత్వ మోసం చేస్తోందన్నారు. ఒకవైపు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చి మరో వైపు పేపర్ లీకేజీ చేసి పరీక్షలను రద్దు చేస్తోందని ఆరోపించారు.

అట్రాసిటీ కేసులపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అంజయ్య

పెద్దకొడప్‌గల్: మండలంలోని అంజని గ్రామంలో శనివారం పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అంజయ్య మాట్లాడుతూ ప్రతి పౌరుడు తమ హక్కులను వినియోగించుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అంటరానితనం నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. వివక్ష లేకుండా కలిసిమెలిసి జీవించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పండరినాథ్‌రావు, పోలీస్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఆర్ ఫౌండేషన్ సేవలు భేష్



బాన్సువాడ: ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలు అభినందనీయం అని మాత శిశు ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్ అన్నారు. శనివారం ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదానం చేసిన సభ్యులను ఆయన సన్మానించారు. అనంతరం శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడుతూ గర్భిణులకు ఆపరేషన్ సమయంలో రక్తదానం చేసి ఎంతో మంది ప్రాణాలను కాపాడారని పేర్కొన్నారు. ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్, సభ్యులు సలీం, సాయిలు, జీవన్, పవన్, లక్ష్మణ్, సంగమేశ్వర్, బాల్‌రాజ్, పండరి తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే అరెస్టు తగదు


శ్రీధర్‌రెడ్డి

భిక్కనూరు: ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టు చేయడం తగదని కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం బీఎస్పీ అధ్యక్షుడు పెద్దబచ్చగారి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో రైతు న్యాయ సేవా సలహాకేంద్రం ప్రారంభోత్సవానికి హైకోర్టు న్యాయమూర్తి శ్రీసుధ హాజరవుతున్న సందర్భంగా పోలీసులు ముందస్తుగా ఆయన్ను శనివారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు న్యాయ సేవా కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమానికి వెళ్తుంటే సీఐ తిరుపయ్య, ఎస్సై ఆనంద్‌గౌడ్ అరెస్టు చేసి బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించారని ఆయన ఆరోపించారు.

ఇద్దరిపై కేసు నమోదు

గాంధారి: మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం

- పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి

సాక్షి, నెట్‌వర్క్: ఉద్యోగాలను రెగ్యులర్ చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు వెల్లడించారు. తమ డిమాండ్లను అమలు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వారు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ మండల పరిషత్ కార్యాలయాల వద్ద జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నిరసన దీక్షలు చేపట్టారు. వారికి వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు మద్దతు తెలిపారు.


ఎల్లారెడ్డిలో ఆందోళన చేస్తున్న కార్యదర్శులు


కామారెడ్డి ఎంపీడీవో కార్యాలయం వద్ద..


బాన్సువాడ: దీక్షలో కూర్చొన్న కాసుల బాలరాజు


పెద్దకొడప్‌గల్..

క్లుప్తంగా

చిన్నారులపై ప్రత్యేక దృష్టి

నిజాంసాగర్: అంగన్‌వాడి కేంద్రాల్లో చిన్నారుల ఎదుగుదలపై ఆయాలు, టీచర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాజేశ్వరి సూచించారు. శనివారం మండలంలోని మహమ్మద్‌నగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ సెక్టార్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి నెలా పిల్లల ఎత్తు, బరువు రిజిష్టర్లల్లో నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లు భారతి, సంగమణి, శైలజ, రమా, గంగమణి, సరస్వతి, ముక్తాభాయి, పార్వతి, స్వరూప పాల్గొన్నారు.

పరిశీలకుడిగా నియామకం


లక్ష్మీకాంతరావు

నిజాంసాగర్: ఎన్నికల సందర్భంగా కర్ణాటక రాష్ట్రంలోని చించోలి అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకునిగా తోట లక్ష్మీకాంతరావును కాంగ్రెస్ అధిష్టానం నియమించింది. ఈ మేరకు శనివారం ఏఐసీసీ దళిత విభాగం జా తీయ అధ్యక్షుడు రాజేష్ లిలోతీయ ఉత్తర్వులు ఇచ్చారు. అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కాంగ్రెస్ విజయం కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు.

రాయితీకి నేటితో గడువు ముగింపు

కామారెడ్డి టౌన్: ఇంటి పన్ను 5 శాతం రాయితీతో చెల్లించే గడువు ఆదివారంతో ముగియనుంది. సెలవు రోజు అయినప్పటికీ పన్ను చెల్లించేందుకు వీలుగా ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను ముందుగానే చెల్లించే వారికి ఈ రాయితీ వర్తిస్తుంది. ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లింపులో భాగంగా కామారెడ్డిలో రూ. కోటికి పైగా, బాన్సువాడలో రూ. 40 లక్షలు, ఎల్లారెడ్డిలో రూ.20 లక్షల వసూలైనట్లు అధికారులు తెలిపారు. గడువు ముగిశాక మొండి బకాయిదారుల ఆస్తులను జప్తు చేస్తామన్నారు.

మానసిక ఆందోళనతో సంతానలేమి



లింగంపేట: మానసిక ఆందోళనతో పాటు పలు సమస్యల కారణంగా చాలా మంది మహిళలు సంతానానికి నోచుకోలేక పోతున్నారని డాక్టర్ హరిత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అజయ్ ఆసుపత్రిలో శనివారం హవిరా ఫెర్టిలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో సంతాన సాఫల్యత ఉచిత శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిత పలువురి భార్య, భర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అజయ్‌కుమార్, సిబ్బంది రమేశ్, శివకుమార్, రామకృష్ణ, అజయ్, శోదన్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

భిక్కనూరు: మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన బండ నర్సింలు అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై ఆనంద్‌గౌడ్ తెలిపారు. నెల కిందట ఆయన జంగంపల్లి గ్రామానికి చెందిన తన మేన మామ క్యాట్రల నర్సింలు ఇంటికి వెళ్లి కొన్నాళ్ల తర్వాత స్వగ్రామానికి వెళ్తున్నానని చెప్పి బయలుదేరినా ఇంటికి చేరుకోక పోవడంతో పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదని ఎస్సై వెల్లడించారు.

రైతు సేవా కేంద్రంలో వాలంటీర్ల నియామకం



భిక్కనూరు: జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో భిక్కనూరులో ఏర్పాటు చేసిన రైతు న్యాయ సలహా సేవా కేంద్రంలో సేవలు అందిచేందుకు ఇద్దరు పారా వాలంటీర్లను శనివారం నియమించారు. పారా వాలంటీర్లుగా నియమితులైన నరేష్, రాజులకు హైకోర్టు న్యాయమూర్తి శ్రీ సుధ నియమాకం పత్రాలను అందజేశారు.

మందుల పంపిణీ



భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరంలో స్థానిక ఆయుర్వేద డాక్టర్ వెంకటేశ్వర్లు పలువురిని పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్య పరిరక్షణకు ఆయుర్వేద శాఖ ప్రచురించిన కరదీపికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నర్సింలు యాదవ్, సిబ్బంది మహమ్మద్ బేగ్, ప్రసాద్, పంచాయతీ సిబ్బంది మోహన్, సిద్ధరాములు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి


ఒంటర్‌పల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న వైఎస్సార్‌టీపీ ఎల్లారెడ్డి ఇంచార్జి జమునారాథోడ్

సాక్షి, నెట్‌వర్క్: అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని పలువురు డిమాండ్ చేశారు. లింగంపేట మండలం ఒంటర్‌పల్లి, సురాయిపల్లి, పోతాయిపల్లిలో వైఎస్సార్‌టీపీ ఎల్లారెడ్డి నియోజకవర్గం ఇంచార్జి జమునా రాథోడ్ శనివారం పంటలను పరిశీలించి ఎకరాకు రూ. 25 వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డి మండలం వెల్లుట్లపేటలో పీసీసీ కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి పంటను పరిశీలించారు. రైతులకు పరిహారం చెల్లించాలని బాన్సువాడలో బీజేపీ నాయకుడు మాల్యాద్రిరెడ్డి, కాంగ్రెస్ బాన్సువాడ నియోజకవర్గం ఇంచార్జి కాసుల బాలరాజు బాన్సువాడ, ఇబ్రహీంపేట్, కొయ్యగుట్టలో దెబ్బతిన్న పంటను, బీబీపేట మండలం ఉప్పర్‌పల్లిలో ఎంపీపీ బాలమణి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. కామారెడ్డిలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ అసెంబ్లీ ఇంచార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ నష్టపరిహారం విషయంలో రైతులకు స్పష్టత ఇవ్వకపోతే మంగళవారం నుంచి ఉద్యమం చేస్తామని వెల్లడించారు.

మొలకెత్తిన విత్తనంతో రైతు కన్నీరు



నస్రుల్లాబాద్: మండలంలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసి మొలకెత్తాయి. కొనుగోలు కేంద్రాల్లో కుప్పలుగా ఉంచిన ధాన్యానికి మొలక వచ్చిందని మైలారం గ్రామానికి చెందిన శాదుల్లా ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

ఆధ్యాత్మికం

- భక్తి శ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం



కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ఆరాధన ఉంటుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు సంగయ్యచారి తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు నాగరాజాచారి, కృష్ణమాచారి, రాజుచారి, పూర్ణాచారిలతో పాటు ఆలయ కమిటీ అధ్యక్షుడు సంగయ్యచారి, రమేష్, బాలయ్య, లక్ష్మికాంతం, శ్రీనివాస్, సుదర్శన్ తదతరులు పాల్గొన్నారు.

- గర్గుల్ గ్రామంలో..

కామారెడ్డి రూరల్: మండలంలోని గర్గుల్ గ్రామంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి 37వ బ్రహ్మ రథోత్సవం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో యజ్ఞం, కుంకుమ పూజలు, మహాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతల రవితేజ గౌడ్, దేవిప్రసాద్ పాల్గొన్నారు

- నేడు ఆరాధన..

నిజాంసాగర్: మండలం కేంద్రంతో పాటు బూర్గుల్, కొమలంచ గ్రామాల్లో ఆదివారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సోమవారం కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు బేగరి రాజు, లింగాగౌడ్, సత్యగౌడ్ తెలిపారు.

- హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

మద్నూర్: మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో శనివారం భక్తులతో సందడి నెలకొంది. కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

- ముగిసిన సప్తాహం



బాన్సువాడ రూరల్: మండలంలోని హన్మాజీపేట్ హనుమాన్ మందిరంలో ప్రారంభమైన అఖండ హరినామ సప్తాహం శనివారం ముగిసింది. వారం రోజులుగా వార్కారులు, గ్రామస్తులు మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో బోనాలను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోనాల సుభాష్, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ అక్బర్, నాయకులు కుమ్మరి సాయిలు, సంజీవ్, సాయిబాబ, శేఖర్, గణేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ప్రొఫెసర్ శ్రీనివాసమూర్తికి నివాళి

భిక్కనూరు: తెలంగాణ యునివర్శిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తూ ఇటీవల అకస్మాత్తుగా మృతి చెందిన శ్రీనివాసమూర్తి చిత్రపటానికి సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. సౌత్ క్యాంపస్ అభివృద్ధి కోసం ఆయన ఎంతగానో కృషిచేశారని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ కవితా తోరస్, ఆచార్యులు సుధాకర్‌గౌడ్, రాజేశ్వరీ, లలిత, యాలాద్రి, ప్రతిజ్ఞ, రమాదేవి, నర్సయ్య, కనకయ్య శ్రీకాంత్‌గౌడ్, ఇంద్రకరన్‌రెడ్డిలు, డాక్టరేట్స్ అసోసియేషన్ ప్రతినిధులు రాహుల్‌నేత, సంతోషుగౌడ్ పాల్గొన్నారు.

బస్ పాసుల పంపిణీ

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో దివ్యాంగులకు రాయితీ బస్సు పాసులను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పుర్ర బాల్‌రెడ్డి, ప్రతినిధులు సిద్ధరాములు, చెట్కూరి దుర్గయ్య పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలో శనివారం పోలీసులు వాహనాలను తనిఖీ నిర్వహించారు. సరైన ధృవపత్రాల్లేని వాహనాలకు చలానా విధించారు. నమోదు చేసి ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ తప్పక ధరించాలని సూచించారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి: మండల కేంద్రంలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో శనివారం ఎస్సై ఆంజనేయులు వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించని వారికి జరిమానా విధించారు.

హెల్త్ అసిస్టెంట్లకు పదోన్నతి

ఎల్లారెడ్డి: మండలంలోని మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న మధుసూదన్, నారాయణలకు పదోన్నతి లభించడంతో ఇతర ప్రాంతాలకు బదిలీ అయినట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్ తెలిపారు.

మినీ మహానాడుకు వెళ్లిన టీడీపీ నేతలు

తాడ్వాయి: వర్నిలో నిర్వహించనున్న మినీ మహానాడుకు తాడ్వాయి మండలం నుంచి పలువురు టీడీపీ నేతలు శనివారం తరలివెళ్లారు. నియోజకవర్గం కో ఆర్డినేటర్ ముడెగాం మహేష్ మాట్లాడుతూ ఎల్లారెడ్డి నియోజక వర్గం నుంచి వంద వాహనాల్లో వెళ్లినట్లు తెలిపారు. నాయకులు మహేష్, దత్తయ్య, రాములు, మల్లయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



బాన్సువాడ రూరల్: నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే సూచించారు. శనివారం ఆయన ట్రైనీ కలెక్టర్‌తో కలిసి బోర్లం గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయితీలో ఏర్పాటు చేసిన లైబ్రరీని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ డివిజన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు దొడ్ల వెంకట్రాంరెడ్డి, రాజేశ్వర్‌గౌడ్, మన్నె నాగభూషణం పాల్గొన్నారు.